సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



అదనపు బాధ్యతలతో సరి
ట్రిపుల్ ఐటీలో బోధనా సిబ్బందికి బోధన కంటే అదనపు బాధ్యతలతోనే సరిపోతోంది. దీంతో విద్యార్థులకు ఎలాం న్యాయం జరుగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 8లో ▸



నత్తా రామేశ్వరుడి దర్శనం
నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరుడు, లక్ష్మణేశ్వరుడు, నష్ట రామ కోటి లింగేశ్వరుడిని ఒకేసారి దర్శించే అవకాశం వైశాఖ మాసంలో భక్తులకు దక్కనుంది. 8లో ▸



ఆన్‌లైన్‌లో చాటింగ్.. ఆపై మోసం
భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళకు ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తి నమ్మించి బాధితురాలి నుంచి దఫాదఫాలుగా రూ.1,60,900లు స్వాహా చేశాడు. 8లో ▸

కేసులు పెట్టినా.. తగ్గేదేలే

- బెల్టు షాపులపై 358 కేసులు
- 715 లీటర్ల మద్యం స్వాధీనం
- అయినా షరామామూలుగానే బెల్టు అమ్మకాలు
- స్టేషన్ బెయిలిచ్చి పంపేస్తున్న అధికారులు

సాక్షి, భీమవరం: మద్యం బెల్టు షాపులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం చెబుతుంటే.. షరామామూలే అన్నట్టు నిర్వాహకుల తీరుంది. గత ఐదు నెలల్లో బెల్టు విక్రయాలుపై జిల్లాలో 356 కేసులు నమోదు చేసిన ఎక్సైజ్‌శాఖ 715 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుంది. అయినా తగ్గేదే లేదన్నట్టుగా జిల్లాలోని సిండికేట్ వర్గాలు గుట్టుచప్పుడు కాకుండా బెల్టు అమ్మకాలు సాగిస్తున్నాయి. జిల్లాలో 193 మద్యం దుకాణాలకు సుమారు 71 షాపులు పట్టణ ప్రాంతాల్లో, పంచాయతీల పరిధిలో మిగిలిన 122 షాపులు ఏర్పాటుచేశారు. మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో లిక్కర్ సిండికేట్లు బెల్టులు పెట్టి అమ్మకాలు చేయిస్తున్నారు. ఒక్కో లైసెన్స్‌డ్ షాపు పరిధిలో రెండు నుంచి ఐదు వరకు బెల్టులు ఉన్నట్టు సమాచారం. తీర ప్రాంతం, మెట్ట గ్రామాల్లో కొన్ని చోట్ల వేలం పాటల ద్వారా బెల్టులు అప్పగించారు. మొగల్తూరు మండలానికి చెందిన కూటమి నాయకుడు బెల్టు షాపు కోసం బేరసారాలు సాగించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కూడా అయ్యాయి. కొన్ని చోట్ల రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిపాజిట్లు చెల్లించిన వారికి, కూటమి కార్యకర్తలకు బెల్టులు అప్పగించారు. చిన్న చిన్న దుకాణాలు, కిళ్లీ బడ్డీల్లో బాటిళ్లు ఉంచి క్వార్టర్, బీర్ బాటిల్‌పై అదనంగా రూ.30 నుంచి రూ.40 వరకు అమ్మకాలు చేస్తున్నారు. కొందరు నిర్వాహకులు వాహనాల్లో మద్యం బాటిల్స్ పెట్టుకుని మందుబాబుల చెంతకు చేరవేస్తూ మొబైల్ సర్వీస్ అందిస్తున్నారు.



నరసాపురం పరిసరాల్లోని తోటలో బెల్ట్ షాపు పక్కన మద్యం తాగుతున్న దృశ్యం(ఫైల్)

358 మందిపై కేసులు

కూటమి ప్రభుత్వం మద్యాన్ని ప్రైవేట్ పరం చేసిన నాటి నుంచి ఆరు నెలల్లో బెల్టు అమ్మకాలపై జిల్లాలో 356 కేసులు నమోదుచేసిన ఎక్సైజ్ అధికారులు 358 మందిని అరెస్టు చేసి 715 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అత్యధికంగా తాడేపల్లిగూడెం స్టేషన్ పరిధిలో 85 కేసులు నమోదు కాగా నరసాపురం పరిధిలో 70 నమోదయ్యాయి. తక్కువగా ఆకివీడు పరిధిలో 40 కేసులు నమోదయ్యాయి. పదికి పైగా బాటిళ్లతో దొరికితే కోర్టులో హాజరుపర్చాలి. పది బాటిల్స్ లోపు ఉంటే సెక్షన్ 34 (ఏ) కింద కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేయవచ్చని న్యాయవాది ఒకరు తెలిపారు. ఐదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా పడే అవకాశముందని, అయితే నేరం రుజువై శిక్ష పడిన ఘటనలు చాలా అరుదని చెబుతున్నారు. బెల్టులు లేకుండా చేస్తున్నామని చెప్పుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులతో తూతూమంత్రంగా సెక్షన్ 34 (ఏ) కేసులతో తంతు నడిపిస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బెల్టు అమ్మకాలు చేస్తే ఉపేక్షించేది లేదని, నిబంధనల మేరకు దాడులు నిర్వహించి బెల్టు అమ్మకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

మాటలకే పరిమితం

ఎమ్మార్పీకి మించి అమ్మకాలు చేసినా, బెల్టులు ఏర్పాటు చేసినా మొదటిసారి రూ. 5 లక్షల జరిమానా విధించాలని, రెండోసారి తప్పు చేస్తే షాపు లైసెన్స్ రద్దుచేయాలని ఇటీవల ఒక సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ హెచ్చరికలను సిండికేట్ వర్గాలు సీరియస్‌గా తీసుకున్నట్టు లేదు. జిల్లాలోని పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం తదితర చోట్ల పలు దుకాణాల్లో బాటిల్‌పై రూ.10 అదనంగా విక్రయిస్తున్నారు. పర్మిట్ రూంల మాదిరి సదుపాయాలతో నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్నా సీఎం ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు.

బెల్టు షాపులపై నమోదైన కేసుల వివరాలు

ఎక్సైజ్ స్టేషన్	కేసులు	పట్టుబడిన వారు	స్వాధీనం చేసుకున్న మద్యం (లీటర్లలో)
ఆకివీడు	40	40	59.94
భీమవరం	55	56	246.24
నర్సాపురం	70	70	102.42
పాలకొల్లు	43	43	53.64
తాడేపల్లిగూడెం	85	85	160.06
తణుకు	63	64	93.10

అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించాలి
కలెక్టర్ సి. నాగరాణి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి 246 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారం కాకపోతే మండల స్థాయి అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, కెఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. పెన్షన్ పెంపు కోసం కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగుల వద్దకు జాయింట్ కలెక్టర్ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణ

భీమవరం(ప్రకాశం చౌక్): భూ సమస్య పరిష్కారం కావడం లేదని ఒక వ్యక్తి ఆత్మ హత్యాయత్నం చేసిన ఘటన భీమరం కలెక్టరేట్‌లో జరిగింది. మొగల్తూరు దయాల్ దాస్ పేటకు చెందిన పాలా వీర వెంకట సత్యనారాయణ (64) కొంతకాలంగా భీమవరంలోని కిషోర్ థియేటర్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. పాలకొల్లు సమీపంలోని కొంతేరులో సత్యనారాయణకు 16 సెంట్ల స్థలం ఉండగా దానిపై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో పలు సార్లు కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కావడం లేదని సోమవారం ఉదయం భీమవరం కలెక్టరేట్ స్పందనకు విషం తాగి వచ్చిన సత్యనారాయణ స్పందన హాల్లో పడిపోయాడు. సత్యనారాయణను పోలీసులు అంబులెన్స్‌లో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: సమగ్ర శిక్ష భీమవరం జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మే 2 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 79890 02168 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా పుస్తకాలు

భీమవరం: జిల్లాలో నూతన విద్యాసంవత్సరానికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, బ్యాగ్, బెల్ట్, షూ, డిక్షనరీలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్, ఎస్ఎస్ఏ సీఎంఓ యండమూరి చంద్ర శేఖర్ చెప్పారు. పుస్తకాల పంపిణీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రతి మండలంలో స్టాక్ పాయింట్‌కు చేర్చేలా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 8 మండలాలకు పాఠ్యపుస్తకాలు 65 శాతం చేరాయన్నారు. ఒక్కో విద్యార్థికి మూడు జతల యూనిఫాం, ఒక జత షూ, రెండు జతల సాక్స్‌లు, బ్యాగ్, బెల్ట్ అందించనున్నట్లు చెప్పారు.

గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

భీమవరం: పోలీసుస్టేషన్ల నుంచి వచ్చే ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదులను స్వీకరించి అనంతరం ఆయా పోలీసుస్టేషన్ల అధికారులతో మాట్లాడారు. వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించి సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు భరోసా ఇచ్చారు.

ద్వారకాతిరుమలలో గణేష్ శర్మకు శిక్షణ



సుబ్రహ్మణ్య గణేష్ శర్మ

ద్వారకాతిరుమల: కంచికామకోటి పీఠం ఉత్తరాధికారిగా నియమితులైన రుగ్వేద పండితోత్తముడు దుడ్డు సుబ్రహ్మణ్య గణేష్ శర్మ ద్వారకాతిరుమలలో రుగ్వేదాన్ని అభ్యసించారు. 2009లో వేసవి సెలవుల్లో తిరుపతిలోని మేనమావ ఇంటికి వెళ్లిన గణేష్ శర్మను ఆదే సమయంలో తిరుపతి వచ్చిన కంచికామకోటి పీఠం శంకరాచార్యస్వామీజీ దగ్గరకు పిలిచి ఆశీర్వదించారు. ద్వారకాతిరుమల దేవస్థానం రుగ్వేద సలక్షణ ఘనాపాటి, సకల జ్ఞాన సంపన్నుడైన రత్నాకర్ శర్మ వద్ద చేర్పించాలని ఆదేశించారు. దాంతో ఆయన రత్నాకర శర్మ ఇంటి వద్ద ఉండి 2009 నుంచి దాదాపు 12 ఏళ్లపాటు వేద విద్యను పట్టుదలతో నేర్చుకున్నారు. ఆయన వద్ద రుగ్వేద సంహిత, ఐతరేయ బ్రాహ్మణ అరణ్యకం, ఉపనిషత్తులు వంటి వాటిలో నిష్ణాతులయ్యారు. సప్తమంజరి, ధాతురూపావళి, సమస కుసుమావళి వంటి ఎన్నో పుస్తకాలను అవపోసన పట్టారు. 12 ఏళ్ల పాటు ద్వారకాతిరుమలలో శిక్షణ పొందిన గణేష శర్మ కంచికామకోటి పీఠం ఉత్తరాధికారిగా నియమితులవడం పట్ల ఇక్కడ వేద పండితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీహెచ్‌ఓల నిరసన గళం



భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విలేజ్ క్లినిక్ సీహెచ్‌ఓలు

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న విలేజ్ క్లినిక్ సీహెచ్‌ఓలు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని 364 మంది సీహెచ్‌ఓలు కలెక్టరేట్ ముందు టెంట్ వేసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. వారి సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత 6 ఏళ్లుగా పనిచేస్తున్నా జీతాలు పెంచడం లేదని, ఉద్యోగ భద్రత లేదని, పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీహెచ్‌ఓలు ప్రమాదవశాత్తు మరణిస్తే ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించడం ఆవేదన వెలిబుచ్చారు. ఆరేళ్లు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాకహాలు ఇవ్వాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించాలని, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలని కోరుతున్నారు.

వృద్ధుడిని అనాథగా వదిలేసిన కొడుకు




తణుకు రైల్వే స్టేషన్‌లో ఉన్న వృద్ధుడు పల్లపరాజు

తణుకు అర్బన్: వృద్ధుడిని అతని కుటుంబ సభ్యులు తణుకు రైల్వేస్టేషన్‌లో వదిలి వెళ్లిన ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. రైల్వేస్టేషన్‌లో మూలుగుతూ ఇబ్బందిపడుతున్న వృద్ధుడిని ప్రయాణికులు ప్రశ్నించగా.. తన పేరు ముత్యాల పల్లపరాజు అని తణుకు ముత్యాలవారి వీధిలో ఉంటున్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధుడిని రైల్వే స్టేషన్‌లో వదలివెళ్లినట్లుగా రైల్వే పోలీసులు చెప్పారు. వృద్ధుడు అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నాడని, కాలుపై పుండు పడి దుర్వాసన వస్తుండడంతోపాటు రాత్రి నుంచి ఆహారం కూడా తీసుకోకపోవడంతో బాగా నీరసించిపోయారు. వృద్ధాప్యంలో ఉన్న వ్యక్తిని కుటుంబసభ్యులు వదిలించుకోవాలని చూడడం బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వృద్ధుడి వ్యవహారం వైరల్ కావడంతో చివరకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతని కుమారుడు వచ్చి తీసుకు వెళ్లినట్లుగా పోలీసులు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి మార్చురీలో కొత్త దందా

- పనిచేయని ఫ్రీజర్ బాక్సులు
- రూ. 3 వేలు ఇస్తే ఫ్రీజర్ బాక్సు పురమాయింపు



ఏలూరు జీజీహెచ్‌లోని మార్చురీ విభాగం (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని మార్చురీ అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గతంలో మృతదేహాలతో అక్రమ వ్యాపారం సాగించిన సిబ్బంది.. తాజాగా మరో వ్యాపారానికి తెరదీశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మార్చురీలోని ఫ్రీజర్ బాక్సులు పనిచేయటం లేదు. రెండ్రోజుల క్రితం దెందులూరు మండలం పోతునూరు గ్రామానికి చెందిన లింగాల పరశురాం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్‌లో మార్చురీకి తరలించగా ఫ్రీజర్ బాక్సులో పెట్టారు. సాయంత్రానికి మృతదేహం దుర్వాసన రావడంతో బంధువులు నిలదీశారు. మార్చురీ సిబ్బంది వారిపై ఎదురుదాడికి దిగారు. మీకు అవసరమైతే వెళ్ళి ఫ్రీజర్ బాక్సు తెచ్చుకుని పెట్టుకోండి? అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

ఇంత జరుగుతున్నా స్పందించని అధికారులు

ఏలూరు జీజీహెచ్‌లో మృతదేహాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్సులు పనిచేయకపోవటంతో సిబ్బంది కొత్త వ్యాపారాన్ని మొదలు పెట్టారంటున్నారు. వారే ప్రైవేటు ఫ్రీజర్ బాక్సులు పురమాయిస్తారు. రోజుకి రూ.3 వేల నుంచి రూ.3,500 చెల్లిస్తే ఫ్రీజర్ బాక్సు తీసుకొచ్చి దానిలో మృతదేహాన్ని భద్రపరుస్తారు. ఇంత జరుగుతున్నా మెడికల్ కాలేజీ యాజమాన్యం ఏం చేస్తుందో అర్థం కావడం లేదని పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది ఈ తరహాలో వ్యాపారం చేస్తుంటే అధికారులకు తెలియదా? లేక వారికీ దీనిలో వాటాలు ఉన్నాయా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా అక్రమ వ్యాపారం సాగిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారా? అని మృతుల బంధువులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రెడ్‌క్రాస్‌కు గోల్డ్ మెడల్



కలెక్టర్ నాగరాణికి అభినందనలు తెలుపుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, రామ భద్రిరాజు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో త్వరలో తలసేమియా పిల్లలకు సెంటర్ ఏర్పాటు చేసి చికిత్స ప్రారంభించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ అందించిన మెరుగైన సేవలకు గుర్తింపుగా 2024–25 సంవత్సరానికి రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్‌కు ఎంపికైందన్నారు. దీనికి కృషి చేసిన జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ, జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది అభినందనీయులన్నారు. మే 8న రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. మే 28న భీమవరం రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో తలసేమియా పిల్లలకు సెంటర్ ఏర్పాటును గవర్నర్ ప్రకటించనున్నట్లు తెలిపారు.

కాళీపట్నం భూ సమస్య పరిష్కరిస్తాం

నరసాపురం రూరల్: అపరిష్కృతంగా ఉన్న కాళీపట్నం భూ సమస్యను త్వరలో పరిష్కరించేలా కృషి చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం కాళీపట్నం రెవెన్యూ గ్రామాలకు సంబంధించి జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు రైతులు మాట్లాడుతూ కాళీపట్నం రెవెన్యూ పరిధి భూముల్లో క్రయ విక్రయాలు లేకపోవడంతో పిల్లల చదువులు, వివాహాలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సాగు చేసుకుంటున్న తమకు భూహక్కు లేకపోవడంతో ఆర్థిక పరపతి లభించక, భూ రిజిస్ట్రేషన్‌లు జరగక తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. భూ హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తామని జేసీ అన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కాళీపట్నం భూములపై రైతుకు భూ హక్కు కల్పించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

3.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

భీమవరం: జిల్లాలో 263 రైతు సేవ కేంద్రాల ద్వారా 1.14 కోట్ల గోనె సంచులు రైతులకు పంపిణీ చేశామని జాయింట్ కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి రబీ ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 263 రైతు సేవ కేంద్రాల ద్వారా 3,01,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, నగదు రైతుల ఖాతాలలో 48 గంటల లోగా జమ చేస్తున్నామన్నారు. 1.14 కోట్ల గోనె సంచులు పంపిణీ చేశామన్నారు. రైతుల తమ ఫిర్యాదులపై 81216 76653 నెంబరులో సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు.



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

చేపల సాగులో కోడి వ్యర్థాలు

- ఆరోగ్యానికి ప్రమాదమంటున్న వైద్యులు
- చటాకాయి గ్రామంలో ఫంగస్ చేపలకు మేతగా కోడి వ్యర్థాలు
- జీవో 56 అమలులో అధికారుల విఫలం

కైకలూరు: కుళ్ళిన కోడిగుడ్లు, కోడి పేగులు, ఈకలు, చనిపోయిన కోడి పిల్లలు, పాడైన కోడిగుడ్లు ఇవి కొల్లేరు ప్రాంతమైన చటాకాయి గ్రామంలో ఫంగస్ చేపలకు వేస్తున్న ఆహారం. వీటిని తిన్న చేపలను మనం తింటే ఆరోగ్యం పాడవడం ఖాయం. అయినా కొందరు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో చేపల సాగు, 1.10 ఎకరాల్లో రొయ్యల సాగు వెరసి మొత్తం 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 84,852.4 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 30,972 మంది రైతులు ఆక్వాపై ఆధారపడి జీవిస్తున్నారు. నియోజకవర్గంలో ఫంగస్ సాగు సుమారు 8 వేల ఎకరాల్లో జరుగుతుందని అంచనా. ఫంగసిస్ చేపలు వ్యాధులను తట్టుకుని, ఎలాంటి మేతనైన జీర్ణం చేసుకునే గుణం కలిగి ఉంటాయి. దీంతో వీటికి కోడి వ్యర్థాలు ఆహారంగా వేస్తున్నారు.



చెరువులోకి వదిలిన కోడి వ్యర్థాలు

కేరాఫ్‌గా చటాకాయి: కైకలూరు మండలం చటాకాయి గ్రామం వ్యర్థాల సాగునకు కేరాఫ్‌గా మారుతోంది. గతంలో నిషేధిత క్యాట్ ఫిష్ సాగుకు అడ్డాగా గ్రామం ఉండేది. అనేక సందర్భాల్లో కోడి వ్యర్థాల వ్యాన్‌లు పట్టుబడ్డాయి. తాజాగా ఆదివారం రాత్రి గ్రామ పెద్దగా చాలామణి అవుతున్న వ్యక్తి చెరువులో కోడి వ్యర్థాలు విడిచిపెట్టారు. పోలీసులు ఆలస్యంగా రావడంతో అప్పటికే చెరువులో కోడి వ్యర్థాలు చల్లాడు. ఇదే గ్రామంలో దాదాపు 100 ఎకరాల్లో ఫంగసీస్ సాగులో కోడి వ్యర్థాలు వినియోగిస్తున్నట్లు సమాచారం. మచిలీపట్నం, విజయవాడ నుంచి ఈ వ్యర్థాలు వస్తున్నాయి. హైదరాబాదు, విజయవాడ నుంచి కుళ్ళిన కోడిగుడ్లను ఆమ్లెట్ రూపంలో ట్రేలలో తీసుకొచ్చి వినియోగిస్తున్నారు. కోడి వ్యర్థాలు కేజీ రూ.15కి విక్రయిస్తోండగా, కోడి గుడ్ల ఆమ్లెట్ కేజీ రూ.20కి కొనుగోలు చేస్తున్నారు. చేపల మేత ఫిల్లెట్ ధరలు కేజీ రూ.40కి చేరడంతో మేత ధరలను తగ్గించుకోడానికి వ్యర్థాల వైపు మక్కుతున్నారు.



పోలీసులు అదుపులో కోడి వ్యర్థాల వ్యాన్

జీవో 56 అమలులో విఫలం : కోడి వ్యర్థాలు, ఇతర వ్యర్థాలతో చేపల సాగు చేసి పర్యావరణానికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జీవో 56ను తీసుకొచ్చింది. వీటిని నియంత్రించడానికి చైర్‌పర్సన్‌గా తహసీల్దారు, సభ్యులుగా వీఆర్వో, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్, ఎస్సై, మెంబరు కన్వీనర్‌గా ఫిషరీస్ డెవలప్‌మెంటు ఆఫీసర్‌ను నియమించారు. చటాకాయిలో వ్యర్థాల సాగుపై కైకలూరు రూరల్ ఎస్సైను వివరణ కోరగా వాహనాన్ని సీజ్ చేశామని, లక్ష పూచికత్తుతో తహసీల్దారుకు బైండోవర్ చేశామన్నారు.

ఆరోగ్యానికి ముప్పు



వ్యర్థాలతో సాగు చేసిన చేపలు తింటే ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రధానంగా ఇన్‌ఫెక్షన్ సమస్యలు తలెత్తుతాయి. నరాల బలహీనతలు, కడుపునొప్పి, వాంతులతో పాటు ఉదర సంబంధ వ్యాధులు వస్తాయి.

– డాక్టర్ అల్లాడ శ్రీనివాసరావు, సూపరింటెండెంటు, ఏరియా ఆస్పత్రి, కైకలూరు.

ఆక్వా రంగానికి చెడ్డ పేరు



కొందరు చేసే తప్పు వల్ల మొత్తం ఆక్వా రంగానికి చెడ్డ పేరు వస్తుంది. పలు సమావేశాల్లో వ్యర్థాలతో సాగు చేయవద్దని హెచ్చరిస్తున్నాం. కొందరు పెడచెవిన పెడుతున్నారు. కలెక్టరు, ఎస్పీలకు వ్యర్థాల సాగుపై ఫిర్యాదు చేస్తాం.

– నంబూరి వెంకటరామరాజు, రాష్ట్ర చేపల రైతు సంఘ అధ్యక్షుడు, తాడినాడ

క్లుప్తంగా

దాడి కేసులో ఆరుగురిపై కేసు నమోదు

భీమవరం: రెస్టారెంట్‌లోని ఆహారం బాగా లేదని వంటమనిషిపై దాడిచేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఏఎస్సై నర్సింహస్వామి సోమవారం చెప్పారు. పట్టణంలోని అజయ్ బార్ అండ్ రెస్టారెంట్‌కు పట్టణానికే చెందిన సుధీర్, మరో అయిదుగురు వెళ్లారు. అక్కడ ఆహారం బాగాలేదని వంట మనిషి ప్రకాష్‌పై బీరుబాటిల్ పగులగొట్టి దాడిచేశారు. దీనిపై బార్ అండ్ రెస్టారెంట్ సూపర్‌వైజర్ దారపురెడ్డి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నర్సింహస్వామి చెప్పారు.

ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణపై అభిప్రాయ సేకరణ

నూజివీడు: ట్రిపుల్‌ఐటీలోని మెస్‌ల నిర్వహణపై సోమవారం అధికారులు విద్యార్థుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. తహసీల్దార్ బీవీ సుబ్బారావు తన సిబ్బందితో వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. మెస్‌లలో భోజనం ఎలా ఉంది, డైనింగ్ హాల్, కిచెన్‌లలో శుభ్రత తదితర విషయాలపై అభిప్రాయాన్ని తెలపమని విద్యార్థులకు ప్రింటెడ్ పత్రాలు అందించారు. వాటిల్లో విద్యార్థులు వారి అభిప్రాయాన్ని తెలిపారు. అభిప్రాయ సేకరణను సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ పరిశీలించారు. భోజనం ఎలా ఉందంటూ పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పెట్టే భోజనం శుచిగా, రుచిగా ఉండాలన్నారు. ట్రిపుల్ ఐటీ అధికారులు నిరంతరం మెస్‌లను పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు.

కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు అందిస్తున్న మాలమహానాడు అధ్యక్షుడు బాబురావు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పేరూరులో స్థానిక సమస్యలపై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో దళితులను కులం పేరుతో దూషించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగజగన్‌బాబురావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మురళీ, అతని తల్లి ఆ గ్రామంలోని సమస్యలకు సంబంధించి దళితులకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ పెద్దల సమక్షంలో దళితులను కులం పేరుతో దూషించి కించపరిచారంటూ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినవారిలో దళిత నాయకులు గరికిముక్కుల రాజేష్, భూపతి సునీత, తదితరులున్నారు.

మ్యాజిక్ ఫెస్టివల్‌లో మెరిసిన లేడీ మెజీషియన్ లక్ష్మీప్రసన్న


బహుమతి అందుకుంటున్న లక్ష్మీప్రసన్న

తణుకు అర్బన్: పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈనెల 27వ తేదీన నిర్వహించిన పల్నాడు మ్యాజిక్ ఫెస్టివల్‌లో తణుకుకు చెందిన లేడీ మెజీషియన్ దండా లక్ష్మీప్రసన్న తృతీయ స్థానంలో నిలిచారు. దేశం నలుమూలల నుంచి 250 మందికిపైగా హాజరైన ఈ ఫెస్టివల్‌లో తృతీయ స్థానంలో నిలవడం చాలా సంతృప్తినిచ్చిందని ప్రసన్న తెలిపారు. ఈ ఫెస్టివల్‌తో వరుసగా మూడేళ్లపాటు మెజీషియన్ ఫెస్టివల్స్‌లో విజయం సాధించి హాట్రిక్‌గా నిలిచినట్లు వివరించారు. 2023లో అమరావతి జరిగిన మ్యాజిక్ ఫెస్టివల్‌లో స్టేట్ ఫస్ట్‌గాను, 2024లో ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రా తాజ్ మ్యాజిక్ ఫెస్టివల్‌లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఫెస్టివల్ నిర్వాహకులు జీవీఆర్, పల్నాడు ఫెస్టివల్ అధ్యక్షుడు బాబునాయుడు, కార్యదర్శి నాగరాజు, గురువు దండా రాములకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ముక్తికి మార్గం.. నత్తా రామేశ్వరుడి దర్శనం

- సోమవారం నుంచి ప్రారంభమైన సప్తకోటి రామలింగేశ్వరుడి దర్శనం
- ఏడాదిలో వైశాఖ మాసంలోనే స్వామివారి దివ్య దర్శనం
- బారులు తీరి త్రిలింగాలను దర్శించుకున్న భక్తులు

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామంలోని గోస్తనీ నదిలో వేంచేసియున్న పరశురామ ప్రతిష్ఠ శ్రీసప్త రామ కోటిలింగేశ్వరుడు సోమవారం నుంచి భక్తులకు దర్శనమిస్తున్నారు. త్రిలింగ క్షేత్రంగా పేరుగాంచిన నత్తారామేశ్వరం గ్రామంలో శ్రీఉమా రామలింగేశ్వరుడు, లక్ష్మణేశ్వరుడు, సప్త రామ కోటి లింగేశ్వరులను ఒకే సమయంలో దర్శించుకునే అవకాశం ఒక్క వైశాఖమాసంలోనే భక్తులకు దక్కుతుంది. రామేశ్వర క్షేత్రంలో సీతారాములు, లక్ష్మణుడు, పరశురాముడు, స్వయంగా శివలింగాలను ప్రతిష్ఠించినట్లుగా స్థల పురాణం చెబుతుంది. ఏడాదిలో 365 రోజులు ఉమా రామలింగేశ్వరుడు, లక్ష్మణేశ్వరుడులను దర్శించుకునే అవకాశం ఉన్నా.. నీటిలో ఉండే పరశురామ ప్రతిష్ఠ రామలింగేశ్వరుని దర్శించుకునే అవకాశం కేవలం 30 రోజులు మాత్రమే ఉంటుంది. వైశాఖ మాసం ప్రారంభకావడంతో సోమవారం దేవాదాయశాఖ కోనేరులోని నీటిని పూర్తిగా తొలగించి స్వామిని భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేసింది. దీంతో సోమవారం జిల్లాలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి సప్తరామ కోటేశ్వరుడిని దర్శించుకున్నారు. భక్తులకు దాతలు అన్నసమారాధనతోపాటు చక్రపొంగలి, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి బారులు తీరి త్రిలింగాలను దర్శించుకున్నారు.


గోస్తనీలో ఉన్న శ్రీసప్తరామ కోటీశ్వర లింగానికి క్షీరాభిషేకాలు చేసి హారతిపడుతున్న అర్చకుడు


ముస్తాబైన నత్తారామేశ్వరంలోని రామేశ్వర ఆలయం


విశేష పూజలు అందుకుంటున్న సీతారామ ప్రతిష్ఠ రామలింగేశ్వరుడు


స్వామిని దర్శించేందుకు బారులు తీరిన భక్తులు

బోధన కంటే అదనపు బాధ్యతలతోనే సరి

- తెలుగు డిపార్ట్‌మెంట్‌లోనే ముగ్గురికి అదనపు బాధ్యతలు
- ఫ్యాకల్టీల్లో కొందరికి ఎక్కువ పనిభారం
- ట్రిపుల్ ఐటీలో కుంటుపడుతున్న బోధన

నూజివీడు: ట్రిపుల్‌ఐటీ.. ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించే విద్యాసంస్థ. అయితే ఇందులో పనిచేసే బోధనా సిబ్బందికి బోధన కంటే అదనపు బాధ్యతలతోనే సరిపోతోంది. ట్రిపుల్ ఐటీలో పర్మినెంట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెంటార్లు, ఐటీ మెంటార్లు పీయూసీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధన చేస్తున్నారు. వీరిలో కొందరికి పలు అదనపు బాధ్యతలను అప్పగించారు. తెలుగు డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఏకంగా ముగ్గురికి అదనపు బాధ్యతలను అప్పగించడంతో వారు నిత్యం అదనపు బాధ్యతల్లోనే మునిగి తేలుతున్నారు. క్యాంపస్ మెయింటెనెన్స్ ఇన్‌చార్జిగా తెలుగు మెంటార్ ఓ శ్రీహరికి అప్పగించారు. ఈయన సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్, గార్డెనింగ్, గెస్ట్‌హౌస్‌ల మెయింటెనెన్స్‌ను చూసుకుంటున్నారు. మూడు షిఫ్టులలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది విషయాలతో పాటు హౌస్‌కీపింగ్, గార్డెనింగ్ సిబ్బంది వ్యవహారాలు చూసుకోవడంతోనే ఉన్న సమయం కాస్తా సరిపోయే పరిస్థితి నెలకొంది. అలాగే తెలుగు సబ్జెక్టు బోధించే కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లలో జడ సీతాపతికి డీన్ స్టూడెంట్ వెల్ఫేర్(బాలుర) బాధ్యతలను, పీ లక్ష్మణరావుకు బాలుర చీఫ్ వార్డెన్ బాధ్యతలను అప్పగించారు. ఇలా ఒకే సబ్జెక్టుకు చెందిన ముగ్గురు బోధన సిబ్బందిని అదనపు బాధ్యతల్లో నియమిస్తే ఆ సబ్జెక్టులో విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుంది అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఫైనాన్స్ ఆఫీసర్‌గా ఏడాదికో ఫ్యాకల్టీ

ట్రిపుల్‌ఈ విద్యార్థులకు పాఠాలు బోధించే శ్రీనాథ్‌కు ఫైనాన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ ఆఫీసర్‌గా ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో ఏడీ స్థాయి అధికారిని డిప్యూటేషన్‌పై నియమించుకోవాలని ట్రిపుల్ ఐటీకి సంబంధించిన యాక్ట్-18లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అదేమీ పాటించకుండా ఏడాదికొక ఫ్యాకల్టీని ఫైనాన్స్ ఆఫీసర్‌గా నియమిస్తున్నారు. సెంట్రల్ డీన్, సెంట్రల్ ఏఓ, ఏఓ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అంటూ కొందరిని నియమించారు. మరికొందరికి మెస్‌ల ఇన్‌చార్జిలుగాను బాలికల హాస్టళ్లకు చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇలా అత్యధిక మంది నిరంతరం అదనపు బాధ్యతల్లోనే మునిగి తేలుతుండటంతో బోధన కొంతమేరకు కుంటుపడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదనపు బాధ్యతలు ఉన్న కొందరు వీటిని సాకుగా చూపించి పరీక్షల సమయంలో ఇన్విజిలేషన్‌ను సైతం తప్పించుకుంటున్నారు. మరి కొందరైతే డబ్బులు వచ్చే సెమిస్టర్ పరీక్షలకు ఇన్విజిలేషన్ వేయించుకుంటూ డబ్బులు రాని మిడ్ పరీక్షల ఇన్విజిలేషన్‌కు దూరంగా ఉంటున్నారు.

కొన్ని బ్రాంచిలకు ఫ్యాకల్టీ తక్కువ

మెకానికల్ బ్రాంచికి సంబంధించి నాలుగు సంవత్సరాలకు సంబంధంచి 240 మంది విద్యార్థులకు 11 మంది ఫ్యాకల్టీ ఉన్నారు. సీఎస్ఈ, ఈసీఈ బ్రాంచిలకు 1,440 మంది చొప్పున విద్యార్థులుండగా సీఎస్ఈకి 20 మంది, ఈసీఈకి 15 మంది మాత్రమే ఫ్యాకల్టీ ఉన్నారు. కెమికల్‌కు 240 మందికి ఏడుగురు, ట్రిపుల్ ఈ కి 480 మందికి 14 మంది, సివిల్‌కు 240 మందికి 13 మంది, మెటలర్జీకి 240 మందికి ఐదుగురు ఫ్యాకల్టీ మాత్రమే ఉన్నారు. దీంతో కొందరికి ఎక్కువగా, మరికొందరికి తక్కువగా పనిభారం ఉండటం జరుగుతోంది. వీటన్నింటిని సరిదిద్ది విద్యార్థులకు మేలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం ట్రిపుల్ ఐటీ వర్గాల్లోనే వినిపిస్తోంది.


నూజివీడు ట్రిపుల్ ఐటీలోని అకడమిక్ భవనం

బాలికపై లైంగిక దాడికి యత్నం

పెదవేగి : ఓ వ్యక్తి బాలికపై లైంగిక దాడికి యత్నం చేసిన ఘటనపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం జగన్నాధపురంలో ఈ నెల 27వ తేదీ రాత్రి కాటం వెంకటేష్ అనే వ్యక్తి ఓ మైనర్ బాలికను పాడుబడిన ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటనపై బాధిత బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మే 12 నుంచి త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై వర్క్‌షాప్

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై మే 12 నుంచి 16 వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు కార్యక్రమ కోఆర్డినేటర్ కార్తికేయశర్మ తెలిపారు. త్రీడీ మోడలింగ్ డిజైన్, ప్రింటింగ్, స్కానింగ్ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులు తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. పరిమిత సంఖ్యలో విద్యార్థులను తీసుకుంటామని, మే 5వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు పోస్టర్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, గూగుల్ ఫార్మ్ నింపాలని, ఇతర వివరాలకు 99854 57227, 90101 01065 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మే 1 నుంచి గోదావరి మండల పరిశోధన సమావేశాలు

పెనుమంట్ర: మార్టేరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో మే 1, 2 తేదీల్లో గోదావరి మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలు జరుగుతాయని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ అసోసియేట్ డైరెక్టరేట్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గోదావరి మండలంలో చేపట్టాల్సిన వరి పరిశోధన విస్తరణ కార్యక్రమాలు చర్చించి 2025-26 కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి కలెక్టర్ సీహెచ్ నాగరాణి ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఏలూరు, కోనసీమ, కాకినాడ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహ సంచాలకులు రైస్ మిల్లర్లు, వరి ఎగుమతిదారులు, పరిశోధన, విస్తరణ సలహా మండలి సభ్యులు, అభ్యుదయ రైతులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అభ్యుదయ రైతులు పాల్గొని తమ సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు.

లారీ డ్రైవర్ మృతి

పెదపాడు: ముందు వెళుతున్న లారీని వెనుకనుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన పెదపాడు మండలంలోని తాళ్లమూడి వద్ద చోటు చేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడలోని దామోదర్ నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ వంకా వసంతరావు (47) మండపేట నుంచి విజయవాడకు లారీని నడుపుతుండగా మార్గమధ్యలో పెదపాడు మండలంలోని తాళ్లమూడి గ్రామానికి చేరుకునే సరికి ముందువెళుతున్న లారీ ఎలాంటి సిగ్నల్స్ లేకుండా అకస్మాత్తుగా నిలుపదల చేయడంతో లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ వసంతరావు అక్కడికక్కడే మృతి చెందాడు. వసంతరావు బంధువుల ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

‘(అ) సత్యం’ నాటికకు మొదటి బహుమతి

భీమవరం: చైతన్య భారతి సంగీత, నృత నాటక పరిషత్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో నిర్వహించిన 18వ జాతీయస్థాయి నాటికల పోటీల్లో చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి ‘(అ) సత్యం’ నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై ప్రథమ బహుమతిని గెల్చుకుంది. విజేతల వివరాలను సోమవారం నాటిక న్యాయనిర్ణేతలు మానాపురం సత్యనారాయణ, ఎల్ రుద్రమూర్తి, సుసుము నాగ భూషణం వెల్లడించారు. సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి ‘జనరల్ భోగీలు’ ద్వితీయ బహుమతి, యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి ‘నా శత్రువు’ తృతీయ బహుమతిని గెల్చుకున్నాయి. జ్యూరీ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి ‘చిగురు మేఘం’, ఉత్తమ రచనగా ‘నా శత్రువు’, ఉత్తమ దర్శకత్వం బాలాజీ నాయక్ ((అ) సత్యం), ఉత్తమ నటుడు కావూరి సత్యనారాయణ (చెన్నయ్య పాత్రధారి - చిగురు మేఘం), ఉత్తమ నటి సురభి ప్రభావతి (సావిత్రమ్మ పాత్రధారిణి - జనరల్ భోగీలు), ఉత్తమ విలన్‌గా గోపరాజు విజయ్ (సీఐ పాత్రధారి - జనరల్ భోగీలు), ఉత్తమ హాస్యనటుడు పి కోటేశ్వరరావు (మా ఇంట్లో మహాభారతం), ఉత్తమ బాల నటుడు యశ్విత (నా శత్రువు), ద్వితీయ ఉత్తమ నటుడు చెరుకూరి సాంబశివరావు (కిడ్నాప్), ద్వితీయ ఉత్తమ నటి జ్యోతిరాణి (మా ఇంట్లో మహాభారతం), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టులుగా గంగోత్రి సాయి (విడాకులు కావాలి) ఎం రత్నకుమారి (బ్రహ్మ స్వరూపం), ఉత్తమ రంగాలంకరణ పీవీ కుమార్ (బ్రహ్మ స్వరూపం), ఉత్తమ సంగీతం లీలమోహన్ (అ సత్యం), ఉత్తమ మేకప్ థామస్ (ఉక్కు సంకెళ్ళు), జ్యూరీ బహుమతి చిగురు మేఘం, ఇది రహదారి కాదు నాటికలు గెల్చుకున్నాయి. విజేతలకు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామ్‌కుమార్‌రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా రాంబాబు, కట్రెడ్డి సత్యనారాయణ, పెన్నాడ శ్రీనివాస్, కృత్తివెంటి సత్యకుమార్ తదితరులు బహుమతులు అందజేశారు.


జాతీయస్థాయి నాటిక పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆన్‌లైన్‌లో చాటింగ్.. ఆపై మోసం

కేసును ఛేదించిన భీమడోలు పోలీసులు

ఏలూరు (టూటౌన్): భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఆన్‌లైన్ మోసాన్ని పోలీసులు ఛేదించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. భీమడోలు మండలం, ఆగడాలలంక గ్రామానికి చెందిన బలే శైలజ (26)కు ఈలో-ఈలో ఆన్‌లైన్ యాప్ ద్వారా రాజు యాదవ్ అనే పేరుతో ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నని చెప్పి నమ్మించాడు. బాధితురాలి సమస్యలను తెలుసుకొని ప్రైవేట్ బ్యాంక్‌లలో లోన్ ఇప్పిస్తానని నమ్మించాడు. లోన్ ప్రాసెసింగ్ ఫీజ్ చెల్లించాలని చెప్పి దఫాదఫాలుగా సుమారు రూ.1,60,900 ఫోన్ పే ద్వారా వసూలు చేశాడు. ఎన్ని రోజులైనా లోన్ రాకపోవడంతో ఆమె నాగరాజును నిలదీయగా నీ ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో ఆమె భీమడోలు పోలీసులను ఆశ్రయించింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం నిందితుడు కడప జిల్లా వేములకు చెందిన నారుబోయిన రాజశేఖర్ అలియాస్ రాజుయాదవ్‌ను గుండుగొలను గ్రామ శివారు పోతునూరు రోడ్డులోని వాటర్ కల్వర్ట్ వద్ద అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు సెల్ ఫోన్లు, రెండు లాప్‌టాప్‌లను సీజ్ చేశారు. కేసును ఛేదించిన భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్, హెచ్‌సీలు ఎస్‌కేఎస్ బాజీ, ఎస్.శ్రీనివాస్, పీసీ ఎం.వెంకటేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్


WANTED FACULTY
We Want Lecturers to Teach Intermediate & Degree for the Following Subjects
1. Commerce, 2. Computer Science, 3. Mathematics, 4. Sanskrit, 5. English
Send your Resume to Email Id
sd/- CA VVN Lakshmi Narayan
Secretary and Correspondent
SRI VASAVI GRANDI MANIKYALARAO (GMR)
JUNIOR, DEGREE & B.ED COLLEGES
Beside SBI, K.N.Road, Tadepalligudem
Cell : 94408 03234, 93926 29278

ఉత్తమ ప్రదర్శనగా ‘స్వేచ్ఛ’ నాటిక


స్వేచ్ఛ నాటిక బృందానికి షీల్డ్ అందజేస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీ పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళా మందిర్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ప్రదర్శితమైన 43వ అఖిల భారత స్థాయి నాటిక పోటీల్లో విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక ఉత్తమ ప్రదర్శనగా మొదటి బహుమతి గెలుచుకుంది. విజేతలకు యూత్ కమిటీ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పాలకొల్లు చాంబర్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ చేగొండి సత్యనారాయణమూర్తి బహుమతులు అందజేశారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్-కొలకులూరు వారి జనరల్ భోగీలు నిలువగా, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నటీ నట సమాఖ్య-పాలకొల్లు వారి అనూహ్యం నాటిక నిలిచింది. జ్యూరీ విభాగంలో కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ వారి ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటిక నిలిచింది. ఈ పోటీలకు కొంతేటి సర్వేశలింగం, గంటా రామమోహనరావు, కొడమంచిలి సత్యప్రసాద్ గుణ నిర్ణేతలుగా వ్యవహరించారు.

నిద్రమత్తులో డాబాపై నుంచి పడి వ్యక్తి మృతి

పాలకోడేరు: నిద్ర మత్తులో డాబాపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మోగల్లులో జరిగింది. పాలకోడేరు ఎస్సై ఎం.రవి వర్మ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు నాగేశ్వరరావు (45) ఆదివారం రాత్రి ఎప్పటిలాగానే డాబాపై నిద్రించాడు. మూత్ర విసర్జన నిమిత్తం వేకువజామున కిందికి దిగే క్రమంలో పైనుంచి జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేశ్వరరావుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ చెప్పారు.


ఉండ్రాజవరపు నాగేశ్వరరావు (ఫైల్)

శ్రీవారి దేవస్థానం కాంట్రాక్ట్ సిబ్బంది నిర్వాకం

దేవస్థానం హైస్కూల్ గ్రౌండ్‌లో మద్యం సేవించిన ట్రాక్టర్ డ్రైవర్, స్కావెంజర్


శ్రీవారి దేవస్థానం హైస్కూల్ గ్రౌండ్‌లోని స్టేజీపై మద్యం సేవిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్, స్కావెంజర్

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం హైస్కూల్ గ్రౌండ్‌లో ఇద్దరు ఆలయ కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం మద్యం సేవించడం వివాదాస్పదమైంది. వివరాల్లోకి వెళితే. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానంలో సెవెన్ హిల్స్ ఫెసిలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తోంది. కాంట్రాక్ట్ తరుపున పనిచేస్తున్న ఒక ట్రాక్టర్ డ్రైవర్, మరో స్కావెంజర్ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లోని స్టేజీపై కూర్చుని మద్యం సేవిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పారిశుద్ధ్య పనులకు వినియోగించే ట్రాక్టర్‌ను సైతం గ్రౌండ్‌లో వారి వద్దే పెట్టుకున్నారు. మధాహ్నం 3 గంటలకు విధులకు వెళ్లాల్సి ఉండగా, ఇప్పుడు మద్యం సేవిస్తున్నారేమిటని ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు, వేసవికాలం కావడంతో సాయంత్రం 4 గంటలకు విధులకు వెళ్తామని ట్రాక్టర్ డ్రైవర్ సమాధానం ఇచ్చాడు. అయినా పాఠశాల గ్రౌండ్‌లో తాగడం ఏమిటని అడిగితే గ్రౌండ్‌లో ఉన్న ఖాళీ మద్యం బాటిళ్లను చూపించి, ఇవన్నీ అవే కదా అని చెప్పడం గమనార్హం. ఈ ఘటనపై అధికారులు విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్లం అమ్మిన కేసులో రూ.25 వేల జరిమానా

కామవరపుకోట: నాటు సారా తయారు చేసే వారికి బెల్లం అమ్మిన కేసులో ఒక వ్యక్తికి రూ. 25 వేల జరిమానా విధించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ యడవల్లికి చెందిన శ్రీ సాయి రంగ ప్రకాష్ గ్రామంలో నాటు సారాయి తయారు చేసే వారికి బెల్లం సరఫరా చేసిన కేసులో తహసీల్దార్ జి.ఎలిసా జరిమానా విధించినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2619]

Wanted

కన్సల్టెన్సీ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-435]

Reputed School in Bhimavaram need BIOLOGY and ENGLISH teacher for high School Classes. Salary Negotiable. Cont.95816 36687, 08816 223416. [SCA25003001]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


రైతు సోదరులకు శక్తిమాన్ రోటావేటర్స్ ఇప్పుడు సబ్సిడీపై

క్రమ సంఖ్య	Manufacturer: TIRTH AGRO TECHNOLOGY (P) LTD., RAJKOT	ఎక్స్ షోరూం ధర	సబ్సిడీ	రైతు చెల్లించవలసినది
1.	SRT-5 అడుగులు 36- బ్లేడ్స్ హెవీ డ్యూటీ	1,45,860	46,000	99,860
2.	SRT-6 అడుగులు 42- బ్లేడ్స్ హెవీ డ్యూటీ	1,51,980	50,000	1,01,980
3.	SRT-7 అడుగులు 60- బ్లేడ్స్ ప్యాడీ మోడల్	1,48,920	50,000	98,920
4.	SRT-8 అడుగులు 66- బ్లేడ్స్ ప్యాడీ మోడల్	1,64,720	50,000	1,14,720

పై మోడల్స్ కొరకు దగ్గరలో ఉన్న మండల వ్యవసాయ అధికారిని గానీ లేదా రైతుసేవా కేంద్రం నందు సంప్రదించగలరు.
ఏలూరు- 9989771199, జంగారెడ్డిగూడెం-9494912858, తాడేపల్లిగూడెం-9640790423


SAKSHI MEDIA GROUP
పదవీ విరమణ శుభాకాంక్షలు
మీ ఆత్మీయులకు ఒక మధుర జ్ఞాపకాన్ని అందివ్వండి.
నేషనల్ హైవే ప్రక్కన, తణుకు రోడ్డు, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.
ఫోన్ : 99122 20558
15%
ఏలూరు 90102 23729 | తాడేపల్లిగూడెం 90102 23729 | భీమవరం 90102 23729
చింతలపూడి 70133 28923 | 90100 68395 | 90108 51166
జంగారెడ్డిగూడెం 70754 60815 | 90100 68395 | 90102 23729
70754 60815 | తణుకు 90102 23729 | 90108 51166
పోలవరం 90102 23729 | 90100 51493 | 81869 95956
90100 51493

క్లుప్తంగా

అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలకు వేదాంత రెడ్డి ఎంపిక


జి.వేదాంతరెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌కు చెందిన విద్యార్థి జి.వేదాంతరెడ్డి మే 15 నుంచి 18వ తేదీ వరకు చిత్తూరులోజరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 10వ అంతర్ జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్ బాల్‌ప ఓటీలకు ఎంపికైనట్లు స్కూలు ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శర్మ సోమవారం తెలిపారు. కోడెవెంకట్రావు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరి గిన జిల్లా బాలుర సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభకనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

నీలాద్రిపురంలో శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


నీలాద్రిపురం గ్రామంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు క్షీరాధివాసం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీనీలాద్రి కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, సాయంత్రం విశ్వక్సేన పూజ, నవగ్రహ హోమం, ధాన్యాధివాసం వేద స్వస్తి నిర్వహించారు. ఈ నెల 30వ తేదిన విగ్రహ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకంతో ప్రతిష్ఠ మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పాల్గొని ప్రతిష్ఠ మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి


మునిసిపల్ కార్యాలయంలో వినతులు అందజేస్తున్న ప్రజలు

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు వినతులను ప్రజలు సమర్పించారు. పట్టణ ప్లానింగ్ విభాగం, ఇంజనీరింగ్ విభాగానికి మూడు, పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి ఒక వినతి వచ్చాయి. కమిషనర్ ఎం.ఏసుబాబు, అధికారులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. ఈ మేరకు ప్రజలకు చైతన్యం కలిగించేందుకు సోమవారం సాయంత్రం సిబ్బందితో కలిసి పట్టణంలోని ఎస్‌వీఆర్ సర్కిల్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏప్రిల్ 30 వ తేదీ లోపు పన్ను బకాయిలు చెల్లిస్తే 50 శాతం రాయితీ ఉందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ముందుగా పన్ను చెల్లిస్తే ఐదు శాతం పన్ను రిబేటు ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఈ. వెంకటరమణ, మేనేజర్ రవి సుధాకర్, టీపీఓ జగదీశ్, ఏఎస్ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యూలా గ్రేస్‌కు అభినందనలు


నిర్వాహకుల ద్వారా గిన్నిస్ రికార్డు అందుకుంటున్న బ్యూలా గ్రేస్

పెంటపాడు: క్రైస్తవ సంగీతంలో గూడెంకు చెందిన దైవసేవకురాలు గిన్నిస్‌లో చోటు దక్కించుకొంది. ఆ వివరాలను ఆమెతో పాటు, జిల్లా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కొమ్మిశెట్టి జాజిరాజు తెలిపారు. ఉన్నత చదువులు చదువుకొని గూడెంలో సువార్త సంగీతంలో సేవ చేస్తున్న బ్యూలాగ్రేస్ ఇటీవల విజయవాడలో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో ఏకధాటిగా కళాకారుల బృందంతో గంటకు 1046 సంగీత వీడియోలు అప్‌లోడ్ చేశారు. కీబోర్డుపై స్వరాలు పలికించి అబ్బుర పరిచారన్నారు.దానికి గాను గిన్నిస్ రికార్డు సభ్యులు ధ్రువపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం గూడెంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బ్యూలాగ్రేస్‌ను పలువురు సేవకులు, క్రిస్టియన్ సంఘాల అధికారులు, రాజకీయ నాయకులు తదితరులు అభినందించారు.

సంక్షేమ పథకాల్లో మహిళలకే పెద్దపీట

తాడేపల్లిగూడెం: సంక్షేమ పథకాల అమలులో తమ ప్రభుత్వం మహిళలకే పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. పట్టణంలో ఎనిమిదో వార్డు, 23వ వార్డు, పెంటపాడు మండలంలో వీటిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏసీలు, కూలర్ల కొనుగోళ్లు తగ్గుముఖం

- మార్కెట్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న కూలర్స్, ఏసీ దుకాణాలు
- సీజనల్ వ్యాపారాలు కూడా జరగని వైనం
- జనం దగ్గర డబ్బుల్లేవ్ అంటున్న వ్యాపారులు
- 50 శాతానికి పడిపోయిన విక్రయాలు


తణుకులో విక్రయాలకు సిద్ధంగా ఉన్న ఏసీలు, కూలర్స్

తణుకు అర్బన్: వేసవి వస్తుందంటే చాలు చల్ల చల్లని గాలులతో పాటు చల్లదనాన్ని ఇచ్చే ఎలక్ట్రికల్ పరికరాలకు ప్రతి ఏడాది గిరాకీ ఉంటుంది. ఇదే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని చల్లదనాన్ని అందించే పరికరాలను విక్రయించే వ్యాపారులు అందుకు తగ్గట్లుగా సామగ్రిని అందుబాటులో ఉంచారు. వినియోగదారులకు కనిపించే విధంగా దుకాణాల ముందు ఆకర్షణగా ఏర్పాటు చేయడం ప్రతి ఏడాది జరుగుతుంది. ఆ పరికరాలను చూసే ప్రయాణికులు, వినియోగదారులు ధర ఎంతో తెలుసుకునేందుకు ఆ దుకాణంలోకి వెళ్లి వారి ఆర్థిక స్థోమతకు తగ్గట్లు ఆ పరికరాలను కొనుగోలు చేసేందుకు తాపత్రయపడుతుంటారు. ఇందుకోసం స్విచ్‌వేస్తే చాలు చల్లదనాన్ని అందించే ఏసీలు, కూలర్స్, టేబుల్ ఫ్యాన్స్ వంటి ఎలక్ట్రికల్ పరికరాలను అందుబాటులో ఉంచుతుంటారు.

కొనుగోళ్లు లేక అల్లాడుతున్న వైనం

తణుకు రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డుల్లో ఉన్న దుకాణాల్లో వివిధ రకాల కంపెనీలకు చెందిన ఏసీలు, కూలర్స్ ప్రతి ఏడాది మాదిరిగానే భారీ ఎత్తున స్టాక్ కొనుగోలు చేసి అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. అయితే ఈ ఏడాది వేసవి ముందుగానే వచ్చిన మండుటెండలకు తోడు ఉక్కపోత వాతావరణం ఉన్నప్పటికీ సదరు పరికరాలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు మాత్రం ముఖం చాటేసినట్లుగా కనిపిస్తోంది. వ్యాపారులు అధికమొత్తంలో సామగ్రిని కొనుగోలు చేసి ఆకర్షణగా పెట్టినా కొనేందుకు వినియోగదారులు రాకపోవడంతో దుకాణాలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గత వేసవిలో జరిగిన వ్యాపారం కంటే 50 శాతం పడిపోయాయని వ్యాపారులు వాపోతున్నారు. సీజనల్ వ్యాపారమైన ఏసీలు, కూలర్స్ వంటి సామగ్రి విక్రయాల్లో కొన్ని దుకాణాలు రకరకాల స్కీంలు పెట్టినా, వాయిదాల పద్ధతిలో పరికరాలను తీసుకెళ్లే సదుపాయం ఉందంటూ ప్రచారం చేస్తున్నా వ్యాపారాలు జరగకపోవడం దుకాణదారుల్లో కలవరం సృష్టిస్తోంది. మార్కెట్‌లో కంపెనీలు, సైజులనుబట్టి ఏసీలు రూ. 30 వేలు నుంచి రూ. 80వేలు, కూలర్స్ రూ. 4వేలు నుంచి రూ. 8 వేలు వరకు ధరలు పలుకుతున్నాయి.

జనం రాక ఖాళీగా ఉన్న దుకాణాలు

వివిధ వ్యాపారాల్లో కొనుగోళ్లకు సంబంధించి ఏ వ్యాపారిని కదిలించినా ప్రజల వద్ద డబ్బు ఎక్కడిది అంటూ సమాధానమిస్తున్నారు. ఇప్పటికే వ్యాపారాలు జరగక చాలా వ్యాపార దుకాణాలు ఖాళీ అయిపోతున్నాయని, కొన్ని దుకాణాలు మూతపడే పరిస్థితి నెలకొందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి నెలా ప్రజలకు ఏదో పథకం పేరుతో డబ్బులు జమయ్యేవని, కానీ నేడు ఆ పరిస్థితులు లేకపోవడంతోపాటు నిత్యావసర సరుకులు, ఇతర సామాగ్రి ధరలు పెరిగిపోయి కుటుంబాలే నెట్టుకు రాలేని నేటి పరిస్థితుల్లో ఏసీలు, కూలర్స్ వంటి ఎలక్ట్రికల్ పరికరాల కొనుగోళ్లపై ప్రజానీకం ఆసక్తి చూపడంలేదని పలువురు చెబుతున్నారు.

వ్యాపారాల్లేవ్



సీజనల్ వ్యాపారాలు కాదుకదా రోజూ జరిగే వ్యాపారాలు కూడా జరగని పరిస్థితి నెలకొంది. కొన్ని దశాబ్దాల వెనక్కువెళ్లినా ఇంతటి కరువు రోజులు ఎప్పుడూ వ్యాపారస్తులు చూడని దుస్థితి. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో తమకు వచ్చే సంపాదనతో ఇళ్లు గడుపుకోవడమే కష్టం మారింది. దీంతో ప్రజల దగ్గర రూపాయి ఆడని పరిస్థితి తలెత్తడంతో కడుపు మాడ్చుకుని ఇంట్లో కూర్చుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా వచ్చిన డబ్బుతో మహిళలు చిన్నపాటి వ్యాపారాలు చేసుకుని ఉపాధి పొందే పరిస్థితి ఉండడంతోపాటు కావాల్సినవి కొనుగోలు చేసుకునేవారు.

– జల్లూరి జగదీష్, రెడీమేడ్ వస్త్ర వ్యాపారి, తణుకు

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిసోర్స్‌పర్సన్స్ పేర్కొన్నారు. స్థానిక గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో సోమవారం మొదటి రోజు వేసవి శిక్షణశిబిరం ప్రారంభమైంది. 30మంది విద్యార్థినీ విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన జి.బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, వి.జనార్ధనరావు, ఆర్.నాగేంద్రకుమా ర్, సీహెచ్ శ్రీదేవి, కె.వెంకటేశ్వరరావులచే కథలు, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, యోగా, క్రీడలు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాస రావు పర్యవేక్షించారు.

అత్తిలి: విద్యార్థులలో పఠనాశక్తి, జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని సర్పంచ్ గంటావిజేత అన్నారు. అత్తిలి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ దాసం బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ పౌరులుగా తయారు కాగలరని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు


తణుకులో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు


గూడెంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఆర్టీసీ డిపో ప్రాంతంలో రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. తణుకు శాఖ ఆధ్వర్యంలో 2–2019 సర్క్యులర్ ప్రకారం విధి విధానాలు ఉండాలని, 114 జీవో ప్రకారం నైట్ అవుట్‌లకు రూ. 400 అలవెన్స్‌లు ఇప్పించాలని, ఈహెచ్ఎస్ పాత పద్ధతిలోనే వైద్య విధానాన్ని అమలు చేయాలని, గత 4 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే అమలు చేయాలని, మహిళలకు చైల్డ్ కేర్ లీవులు ఇప్పించాలనే ప్రధాన డిమాండ్స్‌తో ఎన్ఎంయూఏ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు నిరాహారదీక్షలు చేపట్టినట్లు డిపో కార్యదర్శి బీవీఎస్ఎస్ రావు తెలిపారు. దీక్షలో 12 మంది ఆర్టీసీ డ్రైవరు కండక్టర్లు కూర్చున్నారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీలో నెలకొన్న ఆయా సమస్యలపై తక్షణమే స్పందించాలని ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) నాయకులు రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యంను డిమాండ్ చేశారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్షలు జరిగాయి. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలపాటి సూర్యచంద్రరావు, జోన్ ఉపాధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావులు మాట్లాడుతూ యాజమాన్యం, ప్రభుత్వం తక్షణమే 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, రిమూవల్స్‌ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించాలని, ఆర్టీసీలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, కొత్త బస్సులను కొనుగోలు, లీవ్ సౌకర్యం మెరుగుపర్చాలని, ఈహెచ్ఎస్ స్థానే మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. దీక్షా శిబిరంలో డిపో అధ్యక్షుడు ఎం.ఎస్.బాబు, సెక్రటరీ రవి కుమార్, సీసీఎస్ డెలిగేట్ పి.కొండలరావు, వై.వి.రావు, వి.శ్రీను, ఎం.ఎస్.రావు, జి.ఆదినారాయణ, కేవీఎస్ రాజు, కె.దుర్గారావు, హెచ్.దాలప్పన్న పాల్గొన్నారు.

రేపు పాలిసెట్ ప్రవేశ పరీక్ష

- తణుకులో 8 పరీక్షా కేంద్రాలు
- పరీక్షకు హాజరుకానున్న 2624 మంది విద్యార్థులు

తణుకు అర్బన్: 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో చేరే విద్యార్థులకు స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు తణుకు ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.తులసిరాధ తెలిపారు. తణుకులో 8 కేంద్రాల్లో నిర్వహించే ఈ ప్రవేశపరీక్షకు 2624 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ ప్రవేశపరీక్షకు విద్యార్థులు 10 గంటలకే ఆయా కేంద్రాల్లో రిపోర్టు చేయాలని కోరారు. 11 గంటల తర్వాత కేంద్రానికి వచ్చిన విద్యార్థులను లోపలకు అనుమతించబోమని వివరించారు. హాల్ టికెట్‌లలో పొందుపరిచిన నిబంధనలను విద్యార్థులు తప్పనిసరిగా పాటించాలని, హెచ్‌బీ/2బీ పెన్సిల్, రబ్బరు, బ్లాక్ పెన్, వాటర్ బాటిల్ కేంద్రానికి తెచ్చుకోవాలని, సెల్‌ఫోన్స్, డిజిటల్ వాచ్‌లు, కాలిక్యులేటర్స్ అనుమతించబడవని స్పష్టం చేశారు. ఇతర సమాచారం కోసం మంగళవారం సాయంత్రం 4 గంటలలోపు తణుకు ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయంలో నేరుగాకానీ, 08819–224087 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

పరీక్ష కేంద్రాలివే..

తణుకులో ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల, ఎస్‌కేఎస్‌డీ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్‌కేఎస్‌డీ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎ సెంటర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల బి సెంటర్, శశి ఇంగ్లీషు మీడియం హైస్కూలు, మాంటిస్సోరీ స్కూల్, ఎస్‌సీఐఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షలు నిర్వహింపబడునని ప్రిన్సిపల్ తులసిరాధ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


బల్లిపాడులో మజ్జిక చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

అత్తిలి: మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని అత్తిలి ఎస్‌బీఐ మేనేజర్ శ్రీరామ్ అన్నారు. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుచే ఏర్పాటు చేసిన మజ్జిక చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, సాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సుబ్బారావు, బల్లిపాడు హైస్కూల్ హెచ్ఎం సిహెచ్ బాలసుబ్రహ్మణ్యం, తలారి భద్రరావు, పీఠం సభ్యుడు సత్యనారాయణ, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

పహల్గాం దోషులను కఠినంగా శిక్షించాలి


తణుకులో పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ స్కేటింగ్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవాసంఘు గౌరవ అధ్యక్షుడు రవిశంకర్

తణుకు అర్బన్: జమ్మూ కాశ్మీర్ ఉగ్ర దాడిని ఖండిస్తూ తణుకు మాంటిస్సోరీ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు స్కేటింగ్ ర్యాలీ నిర్వహించారు. స్కేటింగ్ కోచ్ ఎ.భార్గవ్, పీఈటీ శివ పర్యవేక్షణలో స్కేటింగ్ విద్యార్థులతో తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి నరేంద్ర సెంటర్ వరకు ర్యాలీ చేశారు. పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి అత్యంత హేయమైన చర్యగా స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.జ్ఞానమంజరి, ప్రధానోపాధ్యాయని ఎస్.లక్ష్మి, ఎకడమిక్ డైరెక్టర్ పి.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిపై నిరసన

తణుకు అర్బన్: జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని తణుకు బ్రాహ్మణ సేవా సంఘం తీవ్రంగా ఖండించింది. మారణకాండను నిరసిస్తూ, మృతుల కుటుంబాలకు తమ సంతాపం తెలిపింది. సోమవారం తణుకు బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షుడు బీపీ రవిశంకర్ మాట్లాడుతూ ఉగ్రవాదులు సృష్టించిన మారణహోమం దారుణమని, ఘటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి చర్యకు భారతీయులంతా మద్దతుగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వడ్లూరి సీతారాం, ప్రధాన కార్యదర్శి వి.పేరయ్యశాస్త్రి, ఉపాధ్యక్షుడు సీహెచ్ శేషాద్రి, విన్నకోట బాబు, టీవీ భాస్కరం, సహాయ కార్యదర్శులు ఇరగవరపు నాగరాజు, సిద్దేశ్వరప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి

పెంటపాడు: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ఏలూరు హిల్ ప్యారడైజ్‌లో ఇటీవల జరిగాయి. ఈ పోటీలలో పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఉపాధ్యాయిని సాయిస్వరూప ఆధ్వర్యంలో ఆటలు ఆడి సత్తా చాటారు. 7 గురు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు 50, 100, 200 మీటర్ల పరుగుపందెంలో 150 మంది విద్యార్థులతో పోటీపడి బంగారు, వెండి పతకాలు సాధించారు. దీంతోపాటు, పదోతరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారు. భీమవరంలో జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నేషనల్ కోచ్‌గా ఎంపికైన సాయి స్వరూపను కూడా ప్రత్యేకంగా అభినందించారు.

మేడేను విజయవంతం చేయాలి


తణుకులో మేడే కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ పిలుపునిచ్చారు. సోమవారం అంగన్‌వాడీ, స్టేట్ వేరింగ్ హౌసింగ్ హమాలీ కార్మికులతో సీఐటీయూ మేడే పోస్టర్లు ఆవిష్కరించారు. అంగన్‌వాడీలపై పని భారం తగ్గిస్తామని యాప్‌ల వలన భారం పెరిగిందని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సమస్యలు పరిష్కారం దిశగా ఆలోచన పాలకులకు లేకపోవడం బాధాకరమని అన్నారు. స్టేట్ వేరింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీలకు నేటికీ ఈఎస్ఐ సౌకర్యం లేదని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు కూడా పెరగడం లేదని అన్నారు. మేడే స్ఫూర్తితో రానున్న రోజుల్లో సమస్యలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ శ్రీనివాసరావు, చిటికిన నాగబాబు, ఏడుకొండలు, టి.తులసయ్య, కనక దుర్గ, కనక మహాలక్ష్మి, రమాదేవి, సత్య, సుబ్బలక్ష్మి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్‌లు చెల్లించాలి



కొమరవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చినవీరభద్రరావు

తణుకు అర్బన్: ఉపాధి హామీ చట్టం ప్రకారం వేసవిలో చెల్లించాల్సిన సమ్మర్ అలవెన్స్‌లను తిరిగి పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తణుకు మండలం కొమరవరం గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాదిరిగా చేసిన పనికి ప్లే స్లిప్పులు ఇవ్వాలని. ఖర్చులు పెరిగిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం చెల్లించే కూలి సరిపోవడం లేదని పెరిగిన ధరలకనుగుణంగా కూలి పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గడిచిన 10 సంవత్సరాలుగా ఉపాధి హామీ ఊపిరి తీయాలనే ఆలోచనతో ఉపాధి హామీ చట్టంలో ఉన్న వేసవి అలవెన్స్ తొలగించిందని. పలుగు, పారా, తట్ట వంటి పనిముట్లకు ఇచ్చే పారితోషికం కూడా రద్దు చేసిందని వివరించారు. అలాగే వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడం వలన కూలీలకు పని దినాలు భారీగా తగ్గినందున ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగారూ. 600 వేతనం చెల్లించాలని, పని చేసే చోట మౌలిక వసతులు కల్పించి పారా, తాగునీటిని కూలీలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బందుల లక్ష్మి నిర్మల. పాల ఏసమ్మ. బొంత లక్ష్మి, మంగం నరేష్. జంగం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

శ్రామికుల ఇబ్బందులు తొలగించాలి

తాడేపల్లిగూడెం రూరల్: పని ప్రదేశాల్లో కాకుండా 500 మీటర్ల దూరంలో ఫొటోలు తీస్తున్నారని, దీనివల్ల శ్రామికులు ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం, జగ్గన్నపేట, రామన్నగూడెం, పెదతాడేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కాలువలు, పంట బోదెలు, చెరువుల్లో శ్రామికులు పనిచేస్తున్నారని, కొలతలతో నిమిత్తం లేకుండా రోజు వారీ కూలి రూ.307లు ఇవ్వాలని, నిత్యావసర ధరలకనుగుణంగా ఈ మొత్తాన్ని రూ.700లకు పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజక వర్గ నాయకుడు దిద్దే నాగేశ్వరరావు, గ్రామీణ వికాస శ్రామికులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు


ఉపాధి హామీ పథకం శ్రామికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతలు ప్రకారం చేస్తే శ్రామికులకు రూ.300లు కనీస వేతనం తగ్గకుండా వస్తుందన్నారు. సర్పంచ్ యాతం కోటీశ్వరి, కార్యదర్శి కే.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ కమ్ముల సుధీర్, ఫీల్డ్ అసిస్టెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు


తణుకులో పోస్టర్ ఆవిష్కరించిన ఆర్టీసీ డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: సరస్వతి నది పుష్కరాల సందర్భంగా మే 15 నుంచి 26వ తేది వరకు భక్తుల సౌకర్యార్థం తణుకు ఆర్టీసీ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. 35 మంది భక్తులు ఉంటే పుష్కరాల సమయంలో ఏరోజు అయినా బస్సు ఏర్పాటు చేస్తామని, ముందుగా సంప్రదించాలని తెలిపారు. పుష్ బ్యాక్ 2+2, టీవీ సౌకర్యం కలిగిన ఈ సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర కేవలం రూ. 2100 మాత్రమే అని, ఈ బస్సులు తణుకులో బయలుదేరి వరంగల్ భద్ర కాళీమాత, వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారు, కొండగట్టు ఆంజనేయ స్వామి, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, కాళేశ్వరంలోని మహాకాళేశ్వరస్వామి దర్శనం, పుష్కర స్నానం అనంతరం రామప్పలోని రామప్ప దేవాలయం దర్శనం చేసుకుని తిరిగి తణుకు చేరే సదవకాశం కల్పించామని ఈ అవకాశాన్ని తణుకు పరిసర ప్రాంత భక్తులు వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 63042 10265 నంబరులో సంప్రదించాలని తెలిపారు. అనంతరం సరస్వతి పుష్కర స్పెషల్ బస్సులకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌చార్జి గుడూరి శ్రీనివాస్, ట్రాఫిక్ ఇనస్పెక్టర్ దయాకర్, సిస్టమ్ ఇన్‌చార్జి సాయి కుమార్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వినికిడి యంత్రాల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉపకరణాలు, వినికిడి యంత్రాలు పిల్లలో లోపాన్ని అధిగమించేందుకు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈఓలు వి.హనుమ, పీఎంకే జ్యోతిలు పేర్కొన్నారు. స్థానిక భవిత శిక్షణ కేంద్రం బధిర విద్యార్థులకు మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వినికిడి ఉపకరణాలను బధిర విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ సమగ్ర శిక్షసంరక్షణ అందజేస్తున్న ఉపకరణాలు దివ్యాంగుల పిల్లలు ఉపయోగించుకోవాలని కోరారు. వివిధ రకాల అలవెన్స్‌లు అందజేస్తున్నందున పిల్లలకు అవసరమైన శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక విద్య, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీలను ఉపయోగించుకోవాలని కోరారు. పిల్లల్లో చైతన్యం కల్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి పాల్గొన్నారు.